ప్రజాశక్తి

గురువారం 25 జనవరి 2024 | 5 | శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

అంగన్వాడీల ఉద్యమం స్ఫూర్తిదాయకం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

తమ డిమాండ్ల సాధన కోసం 42 రోజులు పాటు అంగన్వాడీలు చేసిన సమ్మె కార్మిక సంఘాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు పేర్కొన్నారు. పుట్టపర్తి విమానాశ్రయం వద్ద గల సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 42 రోజులపాటు జరిగిన సమ్మెలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సుమారు పదిమంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. వీరితో పాటు ఇటీవల మృతిచెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ బాబ్జికి ముందుగా నివాళులర్పించారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెకు సహకరించిన మీడియా, పోలీసు ఇతర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలకు, సిఐటియు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్మికుల, రైతుల, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పాలన చేస్తున్న ఇలాంటి ప్రభుత్వాలు ఉన్నంతకాలం ఉద్యమాలు, సమ్మెలు, బందులు తప్పవని ఇలాంటి వాటికి సిద్ధమై ఉండాలని అన్నారు. అంగన్వాడీ కార్మికుల విషయంలో కొన్ని సమస్యలు ప్రభుత్వం తీర్చిందని వాటిపై వెంటనే జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యమాలకు పత్రికలు ఇతర ప్రజా సంఘాలే కాక, లబ్ధిదారులు సైతం సహకరించారని వారందరికీ ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాబున్నీసా, శ్రీదేవి, కోశాధికారి సిఎస్ శ్రీదేవితో పాటు ఆయా ప్రాజెక్టుల అధ్యక్ష కార్యదర్శులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, అధ్యక్షులు శ్రీనివాసులు, కోశాధికారి సాంబశివ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడాసుబ్బిరెడ్డి, జిఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, ఉషారాణి, రమేష్, పెడబల్లి బాబా, బాళ్ల అంజి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఇళ్లు' ఏవన్నా..?



పునాదులకే పరిమితమైన జగనన్న గృహాలు

- దిష్టి బొమ్మల్లా టిడ్కో గృహాలు
- పునాదులు దాటని జగనన్న కాలనీలు
- పేదల సొంతింటి కల నెరవేరేది ఎలా..?

ఎన్నికలు ఎప్పుడు వచ్చిన....ఏ పార్టీ అయినా చెప్పేది ఒక్కటే మాట.. పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం... అయితే ఎన్నికలు ముగిశాక ఇచ్చిన సొంతింటి హామీ అటకెక్కుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తాయి.జ మళ్లీ సొంతింటి కల నెరవేరుస్తామంటూ హామీలు ఇస్తారు. ఇది ఆ పార్టీ అని కాదు, ఈ పార్టీ అని కాదు. ఏపార్టీ అయినా అంతే..!!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో గత 15 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు.ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పనులే ఇంకా పూర్తి కాలేదు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయలేదు.ప్రస్తుత ప్రభుత్వం దానిని పట్టించు కోలేదు. కనీసం జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు పునాదులు దాటలేదు. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది.

గత టిడిపి ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పింది. కొటిపి సమీపంలో టిడ్కోతో అపార్టమెంట్స్ నిర్మాణం చేసి అందరికి ఇస్తామని పనులను ప్రారంభించింది. ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యం అని జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలను ఆర్భాటంగా ఏర్పాటు చేసింది. ఇళ్ల నిర్మాణాలను మూడు ఆప్షన్లుగా విభజించిన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండవ ఆప్షన్లలో లబ్దిదారులే నిర్మాణం చేసుకోవాలని, మూడవ ఆప్షన్లలో ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇస్తుందని లబ్దిదారులకు చెప్పింది. హిందూపురం పురపాలక సంఘంలో రెండు ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కొట్నూరు వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో కాస్తా పనులు జరుగుతున్నాయి. కొటిపి వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో నిర్మాణపనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రభుత్వం రెండు సార్లు మెగా గ్రౌండింగ్ మేళా చేపట్టింది. కొంతమంది లబ్ధిదారులు సొంత ఖర్చులతో పునాదులు తీయించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు లే అవుట్లలో సిమెంటు రహదారులు, తాగునీటి సరఫరా పైపులైన్లు, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక వసతులతో పాటు గుత్తేదారులు అడిగిన సిమెంటు, స్టీల్, ఇసుక అన్ని అధికారులు సమకూర్చినప్పటికి పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. దీంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. కొంత మంది మెగా గ్రౌండింగ్ మేళా సమయంలో తామే సొంతంగా ఇల్లు నిర్మించుకుంటామని ముందుకు వచ్చారు. అయితే పెరిగిన ధరలకు భయపడి వారు సైతం పునాదులు వేసి వదిలేశారు. మరికొంత మంది తమ వల్లకాదని ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణం చేయలేమని చేతులెత్తాశారు. ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో తొలి విడత కింద దాదాపు 1.20లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున స్థలం కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇళ్లను నిర్మించనున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం లబ్దిదారులకు మూడు ఐచ్ఛికాలు ఇచ్చి అందులో ఒకటి ఎంచు కోవాలని చెప్పింది. జిల్లాలో అత్యధిక శాతం మంది ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. హిందూపురం పురపాలక సంఘంలో అయితే మొత్తం 5712 మందిని తొలి విడత ఎంపిక చేశారు. ఇందులో 784 మంది మొదటి, రెండవ ఆప్షన్ల కింద ఇళ్ల నిర్మాణలను చేపట్టారు. మిగిలిన 4928 మంది లబ్ధిదారులు ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ఎజెన్సీకి పనులను అప్పగించింది. అయినప్పటికి పనులు మాత్రం వేగవంతంగా జరగడం లేదు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశాలు ఇస్తునప్పటికి పనులు ముందుకు సాగడం లేదు. సంవత్సర కాలంగా పనులు మాత్రం పునాదులకే పరిమితం అయ్యాయి.



టిడ్కో గృహాల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పడిన దృశ్యం

పెరిగిన ధరలతో ఇదీ పరిస్థితి..!

పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టణ ప్రాంతంలో ఒక్క యూనిట్‌కు రూ .1.80 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ .1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు నరేగా కింద సర్దుబాటు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు రాష్ట్రం భరించాల్సి ఉంది. హిందూపురంలో దాదాపు 5600 గృహాలను మంజూరు చేశారు. గత ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఆ లక్ష్యం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పెరిగిన సిమెంటు ధరలతో ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోవడం లేదు. దీనికి ధరల మంట తోడయ్యింది. ఒక గృహం 342 చదరపు అడుగుల విస్తీర్ణంలో పునాదులు, గోడలు స్లాబ్ మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉంది. లబ్దిదారులు నిర్మాణం చేసుకుంటే పునాది పూర్తి చేస్తే రూ.60 వేలు, పైకప్పు వరకు స్లాబ్ బిల్లులు నిర్మాణం చేస్తే రూ.60 వేలు, పై కప్పు వేస్తే రూ.30 వేలు చొప్పున చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం చెల్లించే నిధులు సరిపోక పోవడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇచ్చే నిధులను పెంచి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తే నిర్మాణాలు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

కొడిగెనహళ్లి విద్యార్థికి రాష్ట్రీయ బాల పురస్కారం

ప్రజాశక్తి - పరిగి



రాష్ట్రపతి నుంచి అవార్డును అందుకుంటున్న సూర్యప్రసాద్

మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న సూర్యప్రసాద్ 2022లో ఆఫ్రికా ఖండంలో టాంజానియా దేశంలోని కిలిమంజారో పర్వతం, లడక్ ప్రాంతంలోని దక్షిణ పుల్లు పర్వతాన్ని అధిరోహించారు. ఈ విభాగంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారానికి అర్హత సాధించడంతో ఎపి తరపున ఈ నెల 22వ తేదీ న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నుంచి అవార్డు అందుకున్నాడు. సూర్య ప్రసాద్‌తో పాటు బాల పురస్కార గ్రహీతలను ప్రధాని నరేంద్రమోడీ అభినందించారని ప్రిన్సిపల్ మురళీధరబాబు తెలిపారు. విద్యార్థికి రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. సూర్యప్రసాద్‌ను పాఠశాల ప్రధానాచార్యులు ఎన్వి.మురళీధరబాబు, ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి పట్టుగూళ్ల మార్కెట్ నిర్వహణ

హిందూపురం : పట్టు రైతులకు ఇన్సెంటివ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తు పట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టు రైతులు, రీలర్లు చేపట్టిన నిరవధిక సమ్మెను తాత్కలికంగా విరిస్తున్నట్లు పట్టు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాపురం వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టు రైతులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 8వ రోజుకు చేరింది. సమ్మె శిబిరానికి నియోజక వర్గ వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వచ్చి మంత్రి పెదిరెడ్డి రామచంద్రా రెడ్డి సహకారంతో సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. దీంతో గురువారం నుంచి పట్టు గూళ్ల మార్కెట్ నిర్వహణ జరుగుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులతో పాటు పట్టు రైతు సంఘం నాయకులు జయరామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, రీలర్ల అసోసియేషన్ నాయకులు, పట్టు రైతులు పాల్గొన్నారు.

మంత్రి మంత్రదండం ఫలితాన్నిచ్చేనా..?

అసమ్మతి భయంతో బుజ్జగింపుల పర్వం

కదిరి వైసిపిలో రాజకీయ కాక

ప్రజాశక్తి - కదిరి

రాష్ట్రంలో ఎన్నికల సమీపిస్తున్న సమయంలో కదిరి వైసీపీలో రాజకీయ కాక మొదలైంది. వైసిపి అధిష్టానం ఇటీవల కదిరి నియోజకవర్గానికి నూతన సమన్వయకర్తను నియమించింది. ఇక్కడే అసలు రణరంగం మొదలైంది. నూతన సమన్వకర్త మార్పును పార్టీలోని సీనియర్లు వ్యతిరేకిస్తూ రోజుకొకరు చొప్పున తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. పార్టీకోసం పనిచేసిన వారు పార్టీని వీడుతుండడం, ప్రతిపక్ష పార్టీలు బలపడుతుండడం, తాను నియమించిన వ్యక్తికి స్థానికంగా పూర్తి సహకారం అందకపోవడం తదితర విషయాలకు మంత్రికి తలనొప్పులు తెస్తున్నాయి. ఏదో ఒక విధంగా తాను నియమించిన వ్యక్తికి మద్దతు కూడగట్టడానికి మంత్రి నానా పాట్లు పడుతున్నారు. ఇటీవల హిందూపురం నియోజకవర్గంలో ఐదు రోజులు పాటు పర్యటించిన మంత్రికి అనుకున్నస్థాయిలో అనుకూల పవనాలు వీచలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో నూతన సమన్వయ కర్తకు సహకరించని వారిని నాయానో భయానో గుప్పెట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే అదే మంత్రి కదిరి నియోజకవర్గంలో అసమ్మతి నాయకులను తనవైపు తిప్పుకోవటానికి మరోమార్గాన్ని అనుసరించారన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. బుజ్జగింపుల పేరుతో అసమ్మతి నాయకుల గడపలు తొక్కడం మొదలుపెట్టారన్న వ్యాఖ్యానిస్తున్నారు. ఏ అసమ్మతి నాయకుని దగ్గరికి పోయినా ఒకే మంత్రం ఒకే తంత్రం అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. 'పార్టీ గెలుస్తుంది మీకు న్యాయం చేస్తాం.. ఎమ్మెల్సీ వస్తుంది భయపడకు నేనున్నా' అని భుజం తట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆ పార్టీలో వారు చెబుతున్నారు. అందులో భాగంగా నాలుగు రోజుల క్రితం కొంతమంది అసమ్మతి నాయకుల దగ్గరకు వెళ్లి ఇలాగే భరోసా ఇచ్చారని ఆయా నాయకుల అనుచరుల నుంచి అందిన సమాచారం. ఈ నేపథ్యంలో నూతన సమన్వయకర్తకు ఏ మేరకు వారు తమ సహకారాన్ని అందిస్తారో తెలుసుకోవాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సుంది.



వారంలోపు ధర్మవరం రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ధర్మవరంలో వారంలోపు రోడ్ల మరమ్మతులు చేయపో తే తామే రంగంలోకి దిగి స్వయంగా రోడ్ల మరమ్మతులు చేపడతా మని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం అనంతపురంలోని రోడ్డు, భవనాల శాఖ ఎస్ఇ ఓబుల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మవరంలో 1,50,000 మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. వీరంతరూ సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అభివృద్ధి అనే పదానికి పాతరేసి తన వ్యక్తిగత ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఆరోపించారు. నాలుగేళ్ల కాలంలో ధర్మవరం ప్రజలను పీల్చి పిప్పి చేసి సుమారు రూ.4వేల కోట్లు అక్రమంగా సంపాదించాడని ధ్వజమెత్తారు. అంతేగాకుండా తాను చేస్తున్న కాంట్రాక్టు పనులకు ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో అడ్డంకులు సృష్టించారన్నారు. పనులు జరగకుండా వాహనాలను సీజ్ చేయించి, తప్పుడు కేసులు పెట్టించాడన్నారు. తాను న్యాయపోరాటం చేసి పనులను తిరిగి ప్రారంభించానని గుర్తు చేశారు. ధర్మవరం చెరువులో 45 ఎకరాలను కబ్జా చేసి గుర్రాల కోట, అధునాతన భవంతులను నిర్మించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చాడని దుయ్యబట్టారు. మరో 100 ఎకరాలు చెరువు స్థలాన్ని కొల్లగొట్టేందుకు సిద్ధపడ్డాడన్నారు. దీనిపై నేషనల్ గ్రీనరీ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)కి ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు ఎన్‌జిటి విచారణ జరుగుతోందన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.



ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా మూడు మండలాలు, హిందూపురం పట్టణంతో కలుపుకుని 246463 మంది ఓటర్లు ఉన్నారనినియోజక వర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో నియోజక వర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులతో కలిసి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతు ఎన్నికల అధికారుల అదేశాల మేరకు తుది ఓటరు జాబితాను సిద్ధం చేసి ఇప్పటికే విడుదల చేయడం జరిగిందన్నారు. తుదిజాబితాను అనుసరించి హిందూపురం రూరల్ మండలంలో పురుష ఓటర్లు 21255, మహిళా ఓటర్లు 20881, ఇతరులు 2 మొత్తం 42138 మంది ఓటర్లు ఉన్నారన్నారు. హిందూపురం పట్టణంలో పురుష ఓటర్లు 63716, మహిళా ఓటర్లు 63112, ఇతరులు 13 మొత్తం 1.26.841 మంది ఉన్నారన్నారు. నియోజక వర్గంలో పురుష ఓటర్లు 123974, మహిళా ఓటర్లు122471, ఇతరులు 18 మొత్తం 2,46,463 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. నియోజక వర్గంలో 18 సంవత్సరాలు నిండి, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోక పోతే పేర్లు నమోదు చేసుకోచ్చు అన్నారు. మృతి చెందిన వారి పేర్లు ఓటరు లిస్టులో ఉంటే తగిన ఆధారాలు ఇస్తే వాటిని తొలగిస్తామన్నారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుని చేర్పులు, తొలగింపులు చేసుకోవాలని సూచించారు. ఇంకా ఎమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో స్థానిక అధికారులతో కలిసి ఎంజిఎం పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాడానికి తగిన వసతులను ఏర్పాటుకు తనఖీ చేసి, పలు సూచనలు చేశారు. అదే విధంగా రహమత్‌పురంలోని పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్లు స్వర్ణలత, బాబు, నాగరాజు, ఎంపిడిఓ నరేంద్ర కుమార్, సిరికల్చర్ ఎడి సురేష్, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా పంటరుణాలు ఇవ్వాలి

కలెక్టర్ అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రైతులకు వ్యవసాయ, పాడి పరిశ్రమ అభివృద్ధికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు బ్యాంకర్లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, డిఆర్ఓ కొండయ్య, సిఇఓ రాంప్రసాద్, ఎడిసిసి సురేఖ రాణి, ఎల్‌డిఎం రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ బ్యాంకుల ద్వారా రైతులకు పంట రుణాలు అందించడానికి స్కిల్ ఫైనాన్స్ నిర్ధారణ పై జిల్లా కమిటీ ఆమోదించడం జరిగిందన్నారు. జిల్లాలో 2024-25 కు సంబంధించి వరి పంటకు ఎకరాకు రూ. 47 వేలు, రాగి పంటకు రూ.22 వేలు, వేరుశెనగకు రూ.36 వేలు, అరటి పంట మొదటి రకానికి రూ.1.25 లక్షలు, రెండవ రకానికి రూ.70 వేలు, బొప్పాయి పంటకు ఎకరాకు రూ. 80 వేలు, వంకాయ పంటకు రూ.40 వేలు, పొటాటో పంటకు రూ.50 వేలు, టమోటా పంటకు లక్ష రూపాయలు రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆమోదించిందన్నారు. బ్యాంకర్లు వారికి నిర్దేశించిన రుణాలు రైతులకు మంజూరు చేసి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకులు అర్హత పొందిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అర్హతమేర రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పన తోడ్పాటును అందించి తద్వారా జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాలలో మామిడి ప్రధాన పంటగా ఉంటుందని ఇప్పటికే రానున్న మామిడి సీజన్ కు సంబంధించిన ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన సమావేశాలను నిర్వహించడం జరిగిందని అన్నారు. మంచి ఉత్పత్తులు సాధించి ఎగుమతులు చేసి మంచి ధరలు పొందే విధంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా సాధిస్తున్న పంటలను ఇప్పటికే మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని నానో ఎరువుల వినియోగం గురించి మరింత అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న సీజన్లో మామిడి పూత, నాణ్యత గల పంటకు సంబంధించి శాస్త్రవేత్తలతో కలిసి సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాతావరణం మార్పు వల్ల ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా రావడం జరిగిందని దీంతో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని అన్నారు. మందులు, స్ప్రేయర్లు సబ్సిడీ మీద ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్, కస్టర్డ్ ఆపిల్, డ్రాగన్ ఫ్రూట్, ఆవకాడో, నేరేడు, స్వీట్ ఆరెంజ్, చెర్రీ వంటి పంటలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పశువర్ధక శాఖ జెడి శుభ దాస్, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుళ్ల నాగభూషణం, ఎఆర్ కానిస్టేబుల్ హరికుమార్ కుటుంబాలకు ఎస్పీ బుధవారం తన కార్యాలయంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, పోలీసులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

మడకశిర : కర్నూలు నగరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ శిక్షణకు నియోజకవర్గంలోని ప్రోగ్రామ్ కమిటీ, ఓటర్ వెరిఫికేషన్ కమిటీ, ఐటిడిపి సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్షులు బిటి.నాయుడు, ఎమ్మెల్సీ శ్రీకాం త్ హాజరయ్యారు. శిక్షణకు హాజరైన వారిలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు వెంక టరమణ, కాంతరాజు, శివకుమార్, నవీన్, మంజునాథ్, శ్రీకాంత్. గోవిందరాజు, చంద్రశేఖర్ ఉన్నారు.

అంగనవాడీలకు సన్మానం

మడకశిర : 42 రోజుల సుదీర్ఘ పోరాటం ద్వారా డిమాండ్లు సాధించుకున్న సందర్భంగా అంగన్వాడీలు బుధవారం పట్టణంలో ప్రాజెక్ట్ విజయోత్సవ మహాసభ నిర్వమించారు. ముందుగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం నాయకురాళ్లు వి.శ్రీదేవి, జి.పద్మావతి, బికె.ఉషా రాణి, ఆరిఫాలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధిష్టానానికి మాజీ ఎమ్మెల్యే దరఖాస్తు

మడకశిర : వచ్చే ఎన్నికల్లో మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బుధవారం పార్టీ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన తన దరఖా స్తును పార్టీ కార్యాలయంలో హై కమాండ్‌కు సమర్పించారు. ఎన్నికలు సమీపిస్తుండడం, పలువురు ఆశావహులు ఉండడంతో ముందస్తుగా పార్టీ అధిష్టానానికి దరఖాస్తును సమర్పించినట్లు ఆయన తెలిపారు.

27న మండల సమావేశం

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న ఎంపిపి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీఓ కె.రామనాయక్ తెలిపారు. విద్య, తాగునీరు, శిశు, సంక్షేమ, వైద్యం, తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని డబురువారిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవా రం హెచ్ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయుడు నాగరాజు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వారు మాట్లా డుతూ ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షామీర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమాని హర్ష వర్ధన్ సహకారంతో విద్యార్థులకు పలకలు, ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, పెన్సిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో గంగాద్రి, అల్లు తరుణ్, జావీద్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

కొత్తచెరువు : నియోజకవర్గంలోని 193 చెరువులను హంద్రీనీవా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర గురువారం మండల పరిధిలోని చినరాశిపల్లి నుంచి ప్రారంభం అవుతుందని మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పాదయాత్ర బండ్లపల్లి, అప్పలవాడపల్లి, పోతులకుంట, మరుకుంటపల్లి మీదుగా రాత్రికి తలమర్ల గ్రామం చేరుకుంటుందన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఉరుసు

తలుపుల : హిందూ, ముస్లింలు సమిష్టి గా జరుపుకొనే బాబా షర్ఫుద్దీన్ ఉరుసు ఉత్సవాలు స్థానిక కుమ్మరపేటలో గురువారం ప్రారంభమై మూడు రోజుల పాటు నిర్వహిస్తామని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రాత్రి మొగలి అప్పన్న కుమారుడు అశోక్‌కుమార్ ఇంటి నుంచి గంధం తీసుకు రావడంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఎస్ఐ మక్బుల్‌బాషా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు.

ఎద్దుల బండ్ల పోటీలకు ఆహ్వానం

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, బిసి జాతీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ లను కదిరి రూరల్ మండల పరిధిలోని కుమ్మర వాండ్లపల్లిలోని వారి నివాసంలో బుధవారం పట్నం గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో ఈ నెల 27వ తేదీ నిర్వహించే ఎద్దుల బండ్ల పోటీలకు కమిటీ సభ్యులు ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతల్లో ప్రాచీన సంప్రదాయం ఉట్టి పడేలా జిల్లా స్థాయిలో ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో రవి, రాజారెడ్డి, యూసుఫ్, బాషా పాల్గొన్నారు.

నాసా పోటీలకు 'నారాయణ' విద్యార్థులు

కొత్తచెరువు : 2023–24 నాసా పోటీలకు స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు అర్హత సాధించారని ఏజీఎం రమేష్‌బాబు, కోఆర్డినేటర్ ప్రేమసాగర్, ప్రిన్సిపల్ గురుప్రసాద్ తెలిపారు. ఆ పోటీల్లో విద్యార్థులు స్పేస్ కాలనీ, స్పేస్ హోటల్, స్పేస్ మైనింగ్ ప్రాజెక్టు లను ప్రదర్శించనున్నారు. నాసా హార్ట్ కాంటెస్ట్‌కు విద్యార్థులు అర్హత సాధించారన్నారు. అర్హత సాధించి న విద్యార్థులను వారు అభినందించి ఎన్ఎస్ఎస్ టీ షర్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో విశ్వనాథ్, రామ్మూర్తి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాలను నివారించండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లో రవాణా, పోలీస్, మెడికల్, మున్సిపల్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఎన్‌హెచ్ రోడ్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. గత 11 నెలల్లో రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతిపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామాలు, మండలాల వారీగా అధికారులు భద్రతా లోపాలు గల ప్రాంతాలను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. నిరంతరం అంబులెన్స్, క్రేన్ అందుబాటులో ఉంచాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించిన వారికి ప్రోత్సాహకంగా రూ. 5వేలు అందించాలన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మలుపులు గమనించి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నిర్మూలించవచ్చు అన్నారు. సమీక్షలో ఎఎస్పీ విష్ణు, జిల్లా రవాణా అధికారి కరుణ్‌సాగర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌వి.కృష్ణారెడ్డి, ఎంవిఐలు వరప్రసాద్, శివశంకర్, ఆర్టీసీ జిల్లా అధికారి మధుసూదన్, పిఆర్ ఎస్ఇ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి- నంబులపూలకుంట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి రాము అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు ఏకరువుపెట్టారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రారంభంలోనే సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించకపోవడంపై అధికారులను నిలదీశారు. మండల వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత వైసిపి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సిద్ధారెడ్డికే దక్కుతుందన్నారు. అయితే కదిరి–నంబుల పూలకుంట రోడ్డు అధ్వానంగా ఉందని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం గుంతల్లో మట్టి వేయించాలని కోరారు. అసైన్మెంట్ భూముల జాబితాపై చాలా ఆరోపణలు ఉన్నాయని, అర్హులైన పేదలను గుర్తించి భూమి ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. తాగునీటి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం ముగిసిన తర్వాత వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ వారు నడిం బోటుకొండ వద్ద ఆలయం నిర్మాణానికి నీటి కొరత ఉందని వసతులు కల్పించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించకపోవడం గమనార్హం. సమావేశంలో ఎంపిడిఒ ఆదినారాయణ, తహశీల్దార్ నరేంద్రకుమార్, ఎపిఎం చంద్రశేఖర్, ఎంఇఒలు తిరుమల నాయక్, సుబ్బి రెడ్డి, వైస్ ఎంపిపిలు కేశవరెడ్డి, సంపూర్ణమ్మ, ఎంపిటిసి తిమ్మారెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పెనుకొండ


సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు యుటిఎఫ్ నాయకుల నిరసన

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆర్థిక బాకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ. 18,096 కోట్లు బాకీ పడిం దన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి నరేష్, ఎం.కె.నబి, కృష్ణానాయక్, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, జోగప్ప, మహలిం గప్ప, రామాంజినేయులు, శేషాద్రి, ఆదిజినేష్, దివాకర్, శ్రీనివాసులు, నరసింహులు, పెద్దరాజు, వెంకటేశులు, నాగార్జునరెడ్డి, సుబ్బరాయుడు, నాగేంద్ర, సురేంద్ర, జె.నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకులకు ముందస్తు నోటీసులు

పుట్టపర్తి అర్బన్ : పాత పెన్షన్ సాధనకై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ చేపట నున్న 'చలో విజయ వాడ' కార్యక్రమంలో పాల్గొన కుండా జిల్లాలో యుటిఎఫ్ నాయకులకు పోలీసులు బుధవారం ముందస్తు నోటీసులు అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు శివ కందుకూరి, లక్ష్మీనారాయణ, నాయకు లు బాబయ్యకు నోటీసులు ఇచ్చారు. శివ కందుకూరి మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ముందస్తు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతి యుతంగా చేపట్టిన ఉద్యమాలను అణచివేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు.

కొనసాగిన రైతు విజయసంకల్ప పాదయాత్ర

పుట్టపర్తి రూరల్ : నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరు అందించాలనే దృక్పథంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర 6వ రోజూ కొనసాగింది. బుధవారం పెడపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభమై పెడపల్లితండా, మార్లపల్లి, కొట్లపల్లి, నిడిమామిడి, దండువారిపల్లి, కత్తివారిపల్లి మీదుగా గాజులపల్లికి చేరుకుంది. పెడపల్లి గ్రామంలో సర్పంచి మంగలి బాయ్, పారిశ్రామికవేత్త ఎర్ర భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు గజమాల వేశారు. పెడపల్లి, పెద్దతండావాసులు పూల వర్షం కురిపించారు. గాజులపల్లి చెరువు సమీపంలో రిజర్వాయర్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన వెంట ఎంపీపీ ఏవి రమణారెడ్డి, సర్పంచి మంగలి బాయ్, తిరుపాల్ నాయక్, పుట్టపర్తి వార్డు కౌన్సిలర్లు, మాధవరెడ్డి, మాధవప్ప ఎంపీటీసీ సరస్వతిబాయ్ ఉన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలి

ధర్మవరం టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు ప్రాథమిక స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ సూచించారు. రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన అండర్–14 ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను ఎంఇఒలు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి ప్రారంబించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 12 జట్లు పాల్గొంటున్నట్టు అసోసియే షన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ హిదస్తుల్లా తెలిపారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీ ఫైనల్ ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పిడి నాగేంద్ర, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ : పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గత నెలలో ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ గురుగ్రామ్ వారు నిర్వహించిన పరీక్షలో 14మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పరీక్షలో 9మంది గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో కె.హన్సికరెడ్డి(6వ తరగతి), ఎస్.మహమ్మద్ అయాన్(7వ తరగతి) లెవల్–2పరీక్షకు ఎంపిక కాగా కరస్పాండెంట్ అభినందించారు.

శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో శ్రీబాలాజీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆల్సేక్ టెక్నాలజీ చెన్నై వారు నిర్వహించిన ప్రాంగణ నియామకాలు బుధవారం ముగిశాయి. ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ థర్డ్ ఇయర్ విద్యార్థులు ఎస్.హారిక, ఎం.నిఖిత, డి.రిజ్వాన, కే.స్వాతి, ఎం.లక్ష్మి, ఎం.జమీల్ ఖాన్ రూ. 2.4 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారన్నారు. వీరికి ఆల్సేక్ కంపెనీ మేనేజర్ రవితేజ నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులను శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి, కోఆర్డినేటర్ బాబాఫకృద్దీన్, ఎఒ కేశవయ్య, అధ్యాపక బందం అభినందించారు.

26న బెస్ట్ యూనివర్సిటీలో కల్చరల్ ఫెస్టివల్

గోరంట్ల రూరల్ : మండలంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో ఈ నెల 26వ తేదీ జార్జియా దేశస్థులతో కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కల్చరల్ ఫెస్టివల్ జర్మనీ దేశస్తుల మధ్య బెంగళూరు, మైసూరు, వంటి నగరాలలో ఐదు రోజుల పాటు జరుగుతుందన్నారు. చివరగా రిపబ్లిక్ డే రోజున బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో జార్జియన్ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, భారతదేశ సాంస్కృతిక బందాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

వీరభద్ర ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

లేపాక్షి : దుర్గాపాపనేశ్వర వీరభద్ర ఆలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా చోళసముద్రం గ్రామానికి చెందిన రమానందస్వామి, ఆరుగురు కమిటీ సభ్యుల చేత బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పుర విధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, సర్పంచి నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం

పుట్టపర్తి క్రైమ్ : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు తీసుకువెళ్లే క్రమంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం ప్రయాణికుల ఆధ్వర్యంలో డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రజా రవాణా అధికారితో పాటు అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి హాజరై మాట్లాడారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జిఆర్‌కె రెడ్డి, డిపిటిఒ ఉద్యోగ సిబ్బంది, ఎపి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఫకృద్దీన్, జిల్లా ప్రతిభావంతుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రామన్న పాల్గొన్నారు.


ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న శిక్షణ ఎస్ఐలు

ఎస్పీ మాధవరెడ్డికి శిక్షణ ఎస్ఐల సన్మానం

పుట్టపర్తి రూరల్ : జిల్లాలోని 1990 బ్యాచ్‌కు చెందిన 17 మంది ఎఎస్ఐలు 45 రోజుల పాటు ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరు బుధవారం ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. ఎఎస్ఐలుగా ఉన్న తమకు ఎస్ఐ శిక్షణ త్వరగా జరిగేలా చొరవ చూపారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎఎస్పీ ఎన్.విష్ణుని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సూర్యకుమార్, హరినాథ్, ఆనంద్, తేజ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భరత్

పోలింగ్ సెంటర్ల పరిశీలన

రొద్దం : మండలంలోని ఎం.కొత్తపల్లి, తాడంగిపల్లి, గౌరాజుపల్లి, నారనాగేపల్లి, రొద్దకంపల్లి, ఆర్. మరవపల్లి, రొద్దం,పెద్దకోడిపల్లి, పాతర్లపల్లి, తురకలాపట్నం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. అంతకుముందు స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకొన్న పలువురు ప్రజలు వివిధ సమస్యలను ఆయనకి విన్నవించారు. ఆయన వెంట ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, ఎంఇఒ విజయభాసర్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ముందు గిరిజనుల ధర్నా

పెనుకొండ : పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు బుధవారం కొండంపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో మా అమ్మాయిని తీసుకెళ్లాడని వాపోయారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం పోవడంతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

గోనుగుంట్ల ఆర్థిక సాయం

ముదిగుబ్బ : మండల పరిధిలోని పూజారితండాకు చెందిన రామచంద్రనాయక్ అనారోగ్యంతో అనంతపు రం నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణ బుధవారం ఆ హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించి, వైద్య ఖర్చులకు రూ. 20 వేలు అందజేశారు. ఆయన వెంట నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, దేవేందర్‌రెడ్డి, గుర్రం చంద్ర ఉన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

కదిరి టౌన్ : వాల్మీకి, బోయ కులస్తులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు జిల్లా ఆలూరులో వాల్మీకి బోయలు చేపట్టిన చేపట్టిన ఆత్మ గౌరవ రిలే నిరాహార దీక్షకు బుధవారం బంగారు కృష్ణమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కుల శ్రీనివాస్ , రాష్ట్ర నాయకులు కుర్లపల్లి మోహన , నల్లబోతుల మల్లికార్జున, సతీష్ , జిల్లా నాయకులు దొనకొండ ఆనంద్, బూదిలి ధనుంజయ, సి.వీరనారప్ప మద్దతు తెలిపారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు వాల్మీకి అర్జున్‌ని అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించాలి


కదిరి టౌన్ : వాహన చోదకులు డ్రైవింగ్ చేసేటప్పుడు రహదారి నిబంధనలను తప్పక పాటించాలని ఆర్డీవో వంశీకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, డీస్పీ శ్రీలత సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలో రవాణా, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఆర్డీఓ ఆఫీస్ నుంచి జీవిమాను కూడలి వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఆర్డీఓ, డీఎస్పీ జాగ్రత్తలను సూచించారు. లైసెన్స్‌లు అందజేశారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

బుక్కపట్నం : బుక్కపట్నంకు చెందిన చిన్నకృష్ణ అకాల మృతి చెందడంతో వారి కుటుంబానికి సర్పంచి నాగలక్ష్మిరాజు బుధవారం 'వైఎస్ఆర్ బీమా' తక్షణ సాయం కింద రూ. 10వేలు అందించారు. సర్పంచి మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి గౌరమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

పరిగిలో ముగిసిన మంత్రి 'ఆత్మీయ పలకరింపు'

పరిగి : మండల వ్యాప్తంగా 42 గ్రామాల్లో నాలుగు రోజులుగా మంత్రి ఉషశ్రీచరణ్ తలపెట్టిన ఆత్మీయ పలకరింపు కార్యక్రమం బుధవారం పరిగిలో ముగిసింది. కొన్ని గ్రామాల్లో ప్రధాన నాయకులే కార్యక్రమానికి రాకపోవడం, తన వర్గాల నాయకులు, కార్యకర్తలను ఈ కార్యక్రమానికి దూరం ఉంచడం అనుమానాలకు దారితీస్తోంది. ఏదేమైనా మండలంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం విజయవంతం కావడంతో హిందూపురం ఎంపి అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి అనుచర గణం సంబరాలు చేసుకున్నారు.


పరిగిలో మంత్రి ఉషశ్రీచరణ్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

కదిరి పరిశోధనా స్థానం రాష్ట్రానికే తలమానికం

ఆచార్య ఎన్జీ రంగా అగ్రి వర్శిటీ విసి శారదజయలక్ష్మిదేవి

ప్రజాశక్తి-కదిరి టౌన్


కదిరి పరిశోధనా స్థానాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం రాష్ట్రానికే తలమానికం అని, ఇక్కడ చేస్తున్న పరిశోధన ఫలితాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మిదేవి పేర్కొన్నారు. ఆమె బుధవారం కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించి వంగడాలను పరిశీలించారు. అలాగే కదిరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ డి.సంపత్‌కుమార్, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశోధనలు, విత్తనాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. వేరుశనగలో నూతన రకాల పరిశోధనలపై శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసన్న రాజేష్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటరమణలతో సమీక్షించి అధిక దిగుబడినిచ్చే కదిరి–6 రకం లాంటి లక్షణాలు కలిగిన, ఎగుమతికి మంచి ధర పలికే లక్షణాలు ఉన్న రకాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. వేరుశనగలో పురుగులు, తెగుళ్లను నివారించడానికి ప్రకృతి సిద్ధమైన జీవ నియంత్రణ పద్ధతులపై పరిశోధనలు చేయాలని డాక్టర్ వేమన, డాక్టర్ చంద్రనాయుడులకు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్ కోరిక మేరకు పరిశోధనా స్థానం అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, శాస్త్రవేత్తలు, కార్యాలయ సిబ్బంది పెంపు, అదనంగా భూమి కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలోనే కదిరి వేరుశనగ రకాలకు ఎంతో విశిష్టత ఉందని, కదిరి–6, కదిరి లేపాక్షి రకాలు దేశావ్యాప్తంగా 60–70 శాతం సాగవుతూ యూనివర్సిటీకి, రాష్ట్రనికి కీర్తి తెచ్చి పెట్టాయని కొనియాడారు. వేరుశనగలో మరింత లోతుగా పరిశోధనలు చేస్తూ రైతాంగానికి చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు. వారి వెంట పరిశోధనా స్థానం సూపర్వైజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.

ఆసరా కాదు.. టోకరా : బికె

ప్రజాశక్తి-పెనుకొండ


సమావేశంలో మాట్లాడుతున్న బికె.పార్థసారథి

ఆసరా కాదు.. టోకరా అని, ఇచ్చేది గోరంత.. దోచేది కొండంత అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా కోటి మంది మహిళలు ఒక్కొక్కరు రూ. 20 వేలు లబ్ధి పొందారన్నారు. జగన్ పాలనలో ఒక్కో మహిళ పొందిన లబ్ధి రూ. 15 వేలకు తగ్గిపోయిందన్నారు. ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్ రెడ్డి టోకరా వేశారన్నారు. రాష్ట్రంలో 1.14 కోట్ల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షలకే కుదించారన్నారు. ఇలా 35 లక్షల మందికి మొండిచేయి చూపారన్నారు. మద్యం ధరలు మూడు రెట్లు పెంచి రూ. 2 లక్షల కోట్ల విలువ గల నాశిరకం మద్యం అమ్మారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు సిద్ధలింగప్ప, నరహరి, రవిశంకర్, నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, అశ్వత్థనారాయణ, హుజూర్, జావీద్, వెంకటరమణనాయక్, రంగనాథం, శంకర, జానకి, నాని, నంజుండ, ధోని లక్ష్మీనారాయణ, నాగేంద్ర, రాము, మనిరెడ్డి, కసప్ప, ఆదినారాయణ, శివ పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

అల్ట్రా మారథాన్ రన్ ముగింపు సభలో అన్నే ఫెర్రర్

ప్రజాశక్తి-బత్తలపల్లి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్నేఫెర్రర్

సమాజంలోని తోటి వారికి సహాయ పడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, అప్పుడే అందరూ వృద్ధిలోకి వస్తారని, సంతోషంగా ఉంటారని ఆర్డీటి అసోషియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ పేర్కొన్నారు.ఆర్డీటీ ఛైర్మన్ తిప్పేస్వామి అధ్యక్షతన బుధవారం బత్తలపల్లిలో నిర్వహించిన అంతర్జాతీయ రిలే అల్ట్రా మారథాన్ పరుగు ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథులుగా అన్నేఫెర్రర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, మారథాన్ రన్ ఫౌండర్ హువాన్ మాన్వెల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఆర్డీటీని స్థాపించి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు. మారథాన్ రన్‌లో 87 మంది స్పెయిన్, అర్జెంటీనా దేశస్తులు, 65 మంది ఇండియన్స్ మొత్తం 182 మంది పాల్గొన్నారన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ సోమశేఖర్‌మూర్తి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో స్పాన్సర్ సీబా, సంస్థ డైరెక్టర్లు సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


క్రీడాకారులతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు సజావుగా జరుగుతున్నాయని ఆర్డీవో రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. వారు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌డిఒ, కమిషనర్‌తో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి హాజరయ్యారు. ముందుగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రికెట్లో బత్తలపల్లి, ధర్మవరంటౌన్ జట్లు, బ్యాడ్మింటన్‌లో ధర్మవరం రూరల్, ముదిగుబ్బ, వాలీబాల్‌లో పోతుకుంట, ధర్మవరం టౌన్, తాడిమర్రి, కబడ్డీలో గొట్లూరు, ధర్మవరం టౌన్, గొట్లూరు, బత్తలపల్లి జట్లుమ విజయం సాధించాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, క్రీడాకారులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారి బదిలీ అయినా బోర్డులో మారని పేరు'



నంబులపూలకుంట : స్థానిక రెవెన్యూ కార్యాలయం గోడకు ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో అప్పిలేట్ అధికారి పేరు మార్చకపోవడం విమర్శలకు తావిస్తోంది. అప్పిలేట్ అధికారి అయిన ఆర్డీవో రాఘవేంద్ర ఏడాది క్రితమే బదిలీ కాగా ఆయన స్థానంలో వంశీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. అయితే నేటికీ బోర్డులో అప్పిలేట్ అధికారిగా ఆర్డీఓ రాఘవేంద్ర పేరు ఉండడంతో అధికారుల తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో అప్పిలేట్ అధికారి పేరు మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గృహ నిర్మాణ శాఖ అధికారుల ఇష్టారాజ్యం!

కార్యాలయం తెరవరు.. విధులకు హాజరు కారు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎపి గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని కొన్ని నెలల నుంచి తెరవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే అధికారులు ఉన్నా లేనట్లే అని ప్రజలు బాహాటంగా పేర్కొంటున్నారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను తెలుసుకునేందుకు పలువురు కార్యాలయం వద్దకు వచ్చి మూసి ఉండడం చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయంలో పరిస్థితులను చక్కదిద్దాలని మండల ప్రజలు కోరుతున్నారు.


గృహ నిర్మాణ శాఖ కార్యాలయం

బాలికలకు సామాజిక అవగాహన అవసరం



ప్రతిభా విద్యార్థినిని సన్మానిస్తున్న అధికారులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సిడిపిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమాజంలోని ఆడపిల్లలందరూ సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని డీఎస్పీ శ్రీనివాసదేవ్ సూచించారు. మండల పరిధిలోని జగరాజుపల్లి కెజిబివిలో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి అధ్యక్షతన 'జాతీయ బాలికా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, తదితర రంగాల్లో బాలికలు మరింతగా చురుగ్గా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లక్ష్మీ కుమారి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంస్కృతిక ఆటల పోటీల విజేతలు కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అధికారులు పిల్లల చేత సంతకాల ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రామ్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఖయూం, డిసిపిఒ మహేష్, ఇన్స్పెక్టర్ రామయ్య, బాలికల పరిరక్షణ అధికారి నాగలక్ష్మి, మురళి, సునీత, రెడ్స్ సంస్థ ప్రతినిధి కొండప్ప, ఐసిడిఎస్ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది, కెజిబివి ఎస్ఒలు, సిబ్బంది, పలు స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి డా. జి.శాంతలక్ష్మి బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వి.పుష్పలత, మహిళా సంరక్షణ కార్యదర్శి స్వాతి, గిరిజన గురుకుల పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సరోజమ్మ, గిరినందన్, పురుషోత్తం, గుణవతి, గీత, కృష్ణవేణి, లీలావతి, రఘునందన్, శ్వేత, రేణుకాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు మహబున్నీసా, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని ఆర్.మరువపల్లి కెజిబివిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.అనురాధ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెనుకొండ సిడిపిఒ జి.శాంతలక్ష్మి హాజరై బాలికల హక్కులు, పరిరక్షణ, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగవివక్ష, బాలికల విద్య ప్రాముఖ్యత, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుశీల మ్మ, ఎంఎల్‌హెచ్‌పి ఎస్ఒ నాగరత్నమ్మ, శోభ, విజయలక్ష్మి, అరుణకుమారి, వెంకటలక్ష్మి, శాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలగౌరి పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఒ మోహనమ్మ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక కెజిబివిలో ఎస్ఒ నీలిమ అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ రెడ్డిరమణమ్మ హాజరై బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి, సిబ్బంది ధనమ్మ, భాగ్యమ్మ, రత్నమ్మ, పార్వతి, జయసుధ, సంపూర్ణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : ఆడపిల్లలను చదివించడం.. రక్షించుకోవడం మనందరి బాధ్యత అని సీడీపీవో రెడ్డి రమణమ్మ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పూలకుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం సీడీపీవో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కిశోర బాలికలకు పోషణ, ఆరోగ్య విద్య, హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల పట్ల జరిగే అనార్థాలను వివరించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాంతి, జయమ్మ, అనిత, సరస్వతి, హెచ్ఎం కేశవమూర్తి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, సహాయకులకు వైసిపి నాయకుడు మనోజ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బుధవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆటోనగర్ వద్ద గుడిసెలలో జీవనం సాగిస్తున్న పిల్లల నడుమ కేక్ కట్ చేసి, వారికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, చైతన్య గంగిరెడ్డి, బాలరాజు, శ్రీరాములు, మోదా శివ, ఉమర్ ఫారూక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యూనైటెడ్ ఫ్రంట్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఆధ్వర్యంలో ముస్లిం జేఏసీ అధ్యక్షతన టిప్పు సుల్తాన్ జాతీయ సామాజిక సేవా పురస్కారాన్ని సామాజిక సేవకుడు మనోజ్ జూలియట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రక్తదాన సంఘం అధ్యక్షులు షబ్బీర్, మాజీ జామియా మసీదు ముతవల్లీ తలహాఖాన్, కౌన్సిలర్ ఆసిఫ్, అజ్మతుల్లా, శ్రీనివాసరెడ్డి, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల తాలుకా కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హిందూపురం తాలూకా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో తాలూకా పరిధిలోని వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఎన్నికల అధికారి నారాయణరెడ్డి, సహాయ అధికారి బాబాఫకృద్దీన్, పరిశీలకులు గోవిందప్ప, జిల్లా అధ్యక్షుడు విపి భాస్కర్ రెడ్డి సమక్షంలో తాలూకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రవీంద్రారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా జగదీష్, ఉపాధ్యక్షులుగా వెంకట రమణ, మల్లప్ప, కిరణ్ కుమార్, రమేష్ బాబు, రియాజ్, లక్ష్మీదేవి, షాకీర్‌లు కార్యదర్శిగా వన్నప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సుధాకర్, శ్రీరాములు, అరుణ, నరసింహులు, గిరిజమ్మ, మంజునాథ్, రాఘవేంద్ర, ట్రెజరర్‌గా ప్రభాకర్ రెడ్డిలను ఎన్నుకున్నారు.

పరిటాల రవికి ఘన నివాళి



పరిటాల ఘాట్ వద్ద నాయకుల నివాళి



కదిరిలో పరిటాల రవి చిత్రపటానికి నాయకుల నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భూమి ఉన్నంత వరకూ దివంగత పరిటాల రవీంద్రను ప్రజలు మర్చిపోరని మాజీ మంత్రి పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం రామగిరి మండలంలోని వెంకటాపురంలో ఉన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో సునీత, శ్రీరామ్ తీవ్ర బావోద్వేగానికి గురయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పరిటాల రవి చనిపోయి 19ఏళ్లు అయిందంటే నమ్మబుద్ది కావడం లేదన్నారు. ఆయన చేసిన కార్యక్రమాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నాయనానరు. ఎంతో మంది పుడుతారు.. చనిపోతారు.. కానీ చరిత్ర కొంతమంది మాత్రమే నిలిచిపోతారన్నారు. అలాంటి వారిలో ఎన్టీఆర్, పరిటాల రవి ముందుంటారన్నారు. అలాంటి పరిటాల రవిపై కొంతమంది కారుకూతలు కూస్తూ ఉంటారన్నారు. ఇలాంటి పిచ్చి కూతలతో ఆయన ఛరిష్మాను ఇంచు కూడా కదల్చలేరన్నారు. ఆయన సేవలను కొనసాగిస్తామన్నారు. ఇకపోతే వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ముఖ్యంగా సిఎం జగన్ బటన్ నొక్కుడు తప్ప చేసేదేమీ లేదన్నారు. సోమవారం ఉరవకొండలో వైఎస్ఆర్ పేరుతో బటన్ నొక్కినా ఇంత వరకూ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు పడలేదన్నారు. పోలవరం కట్టలేని దద్దం ప్రభుత్వం జగన్ ది అన్నారు. అలాగే తమ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.800 కోట్లతో హంద్రీనీవా నుంచి పేరూరుకు ప్రాజెక్టు తెచ్చారని గుర్తు చేశారు. అలాంటి డ్యామ్‌కు వర్షాలు కురిసి నీరు వస్తే తామే తెచ్చామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. రానున్నది టిడిపి ప్రభుత్వమే అని, తాము అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా దండుకున్న భూములను వెనక్కి తీసుకుని పేదలకు పంచుతామన్నారు.

పుట్టపర్తి రూరల్ :దివంగత నేత పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు బుధవారం రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామానికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్‌రెడ్డితో పాటు మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, శ్రీరామ్‌రెడ్డి, శ్రీరామ్‌నాయక్, అంబులెన్స్ రమేష్, ఉరువాకిలి సురేష్, గూడూరు ఓబులేసు, నారాయణస్వామి, రామాంజనేయులు, తదితరులు తరలివెళ్లి పరిటాల రవి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధర్మవరం టౌన్ : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు టిడిపి నాయకులు, తెలుగు మహిళా నాయకురాళ్లు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నాక్యాంటిన్, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వాస్పత్రి, శ్రీలక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్, కదిరిగేటు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వెంకటాపురం తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, ఫణికుమార్, మద్దిలేటి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, పఠాన్‌బాబుఖాన్, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, బొట్టు కిష్ట, కేశగాళ్ల శీన, గోసల శ్రీరాములు, చిన్నూరు విజయ్‌చౌదరి, భాస్కర్ చౌదరి, చీమల రామాంజి, చీమల సూరి, చీమల సుబ్బరాయుడు, రామాంజి, అమర్నాథ్‌చౌదరి, సూరి, రవి, చిరంజీవి, కార్తీక్‌బాబు, మాధవరెడి, ఓంకార్, కేతినేనిరాజు, పల్లపు రవీంద్ర, చట్టా లక్ష్మీనారాయణ, అడ్డా మహేశ్, కేశవ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో తెలుగుతమ్ముళ్లు పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక అంబేద్కర్ కూడలిలో పరిటాల రవీంద్ర వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, శంకర్ నాయుడు, కుంచె నాగేంద్రప్రసాద్, తోట సరోజమ్మ, బాలప్ప, శ్రీధర్‌రెడ్డి, ఓబులేసు, వివిధ గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బికె సాయికళ్యాణ్ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, సిద్దయ్య, రవిశంకర్, సర్పంచి శ్రీనివాసులు, హుజురుల్లాఖాన్, బోయ గాయత్రి, షౌకత్, జావిద్, గుట్టూరు ఆదిశేషు, నాగరాజు, వర ప్రసాద్, రబ్బానీ, రియాజ్, పోతిరెడ్డి, కన్నా స్వామి, పులగురు శ్రీనివాసులు, ప్రభంజన కుమార్, నాగప్ప, విజయకుమార్, దోని లక్ష్మి నారాయణ, చంద్రమౌళి, సీఫారం శ్రీనివాసులు, బాలచంద్రర్, బాలు నాయక్, రమేష్ నాయుడు, నంజుండ, శ్రీను, ఆది, శమ్ము, సానేపల్లి వెంకటేష్, శెట్టిపల్లి వెంకటేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తన కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పరిటాల రవీంద్ర చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద కురుబ కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. .

ముదిగుబ్బ : స్థానిక బస్టాండ్ కూడలిలో టిడిపి ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర చిత్రపటం ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి అరటి పండ్లు పంచి పెట్టారు. అనంతరం వాహనాల్లో వెంకటాపురం వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, కనుమ చంద్ర, సూర్యశేఖర్‌రాజు, మహబూబ్ పీరా, ఆనంద్, తుమ్మల సూరి, ఆది, నారాయణస్వామి, అమరాకేశవ, కృష్ణమూర్తి, శ్రీరాములు, రామాంజి, హనీఫ్, దాదు, గోపాల్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవి టిడిపికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాగేంద్రప్రసాద్, షర్ఫుద్దీన్, సైకిల్ షాప్ బాబా, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, గాజుల చంద్రమోహన్, బోయ రాజు, రాహుల్, కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు.